# వీడ్కోలు

పాడిబొంగు భుజంమార్చుకుని నారాయణరావు ముఖం చిట్లించి "అబ్బ ఈ ఎండ యివాళ మరీ మాడ్చి చంపుతోంది" అన్నాడు.

రాజారావు "మిమ్మల్ని యిబ్బంది పెట్టాల్సివచ్చింది" అన్నాడు.

"ఫర్వాలేదులెండి. ఈ మాత్రానికే అరిగిపోతామా. కాని ఈ చిన్న వయసులో అనుభవించాల్సిన జీవితం యిలా అర్థాంతరంగా అంతం అయిందంటే. చాలా జాలిగావుంది" అన్నాడు నారాయణరావు.

వెనక మోస్తున్న వాళ్ళిద్దరూ కూలి మనుషులు. వాళ్లు ఏమో పరాచికాలు, మధ్యమధ్య తగూలు ఆడుకుంటున్నారు.

నారాయణరావు తానుగా ముందుకువచ్చి "ఓ కొమ్ము నేను కాస్తాను" అన్నాడు. రాజారావు వారించాడు. కాని నారాయణరావు చొరవ తీసుకున్నాడు.

ఎండ చుర్రు మంటూంది. గాలి స్తంభించిందేమో బాగా ఉక్కబోస్తూంది.

ఆ వీధిలోవాళ్ళు రకరకాలుగా చెప్పుకుంటున్నారు. "అనుభవించాల్సిన జీవితం_ పాపం ఏం అనుభవించింది! ఎప్పుడు చూసినా ఏదో చాకిరీ చేస్తూ కనిపించేది" అన్న దో కావిడ.

రాజారావు చిన్నబుచ్చుకున్నాడు.

"ఆడదానికి ఓ వయస్సు వచ్చేసరికి ఎక్కడవుంటే పూజితమో అక్కడే ఉండాలి. చివరికి కన్న తల్లయినా సరే బరువుగానే చూస్తుంది."

రాజారావు ముఖం ఎర్రబడిపోయింది.

తల్లి ఆక్రందన వీధి చివరికికూడా వినిపిస్తూనేవుంది.

శవం మొయ్యటం నారాయణరావుకి యిదే మొదలు. అలవాటు లేకపోయినా కష్టంలో ఆదుకోవాలనీ పోయినవ్యక్తి పట్ల గౌరవం ప్రదర్శిస్తున్నాననే గర్వంతో ఆవేశంతో అతనికా పని భారం అనిపించలేదు.

కొంతదూరం పోయేసరికి రాజారావు సంజాయిషీ చెప్పుకుంటూన్న ధోరణిలో "రెండు సంవత్సరాలనుంచి నా పక్కనే ఉంటున్నారుగదా. మీకు తెలియంది ఏముంది? నా శాయశక్తులా ప్రయత్నం చేశాను. తిరిగి తిరిగి కాళ్ళు బలపాలు కట్టాయనుకోండి. కాని ఒక్క సంబంధంకూడా అనువుగా దొరకలేదు."

నారాయణరావు "మీకు చెయ్యగలిగింది చేశారు" అన్నాడు.

"అక్కడికీ కడుపుకు తినకుండా, పిల్లలసంగతికూడా చూసుకోకుండా రెండువేలుపైగా దాచాను దీనికోసరమే. చెల్లిని ఎంతో ఘనంగా అత్తవారింటికి పంపాలనుకున్నాను. ఇలా వీడ్కోలు చెప్పవలసి వస్తుందని అనుకోలేదు."

రాజారావు కుటుంబ పరిస్థితులు కొంతవరకూ నారాయణరావుకి తెలుసు. అతని రాబడి అతని కుటుంబానికి ఏ మాత్రం చాలదనికూడా అతనికి తెలుసు. వాళ్ళు దుర్భరమైన పేదరికం అనుభవిస్తున్నారు. వాళ్ళకి కట్టుకుందుకు సరయిన బట్టలుకూడా లేవు. ఇంటి అద్దెలుకూడా సరిగ్గా యివ్వలేరు. నెలనెలా యింటాయనవచ్చి పెద్ద గొడవచేసి పోతూంటాడు. అప్పుడప్పుడు నారాయణరావు రెండూ మూడూ యిచ్చి ఆదుకుంటూ వుంటాడు కూడాను.

నిజానికి రాజారావు ఎవరో ఏదో అంటున్నారనే బాధకన్నా తన అంతరాత్మలో తానే ఏదో బాధపడుతూన్నట్టు కనిపిస్తున్నాడు.

కొంతదూరం పోయింతర్వాత "చెల్లిని ఎంతో ఘనంగా అత్తారింటికి పంపాలనుకున్నాను. ఇలా వీడ్కోలు చెప్పవలసి వస్తుందని అనుకోలేదు." రాజారావు కంఠం రుద్ధమయింది.

నారాయణరావు సానునయ పర్చాడు.

రాజారావు చెల్లెలి స్మృతుల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు. "ఎంత నెమ్మదో అంత గుంభన. తగని మొహమాటం. ఎన్నడూ నోరు తెరిచి యిది కావాలని అడగ

లేదు. ఆమె మనసులో ఏముందో మనమే గ్రహించుకోవాలి. మీరంటే ఆమెకు చాలా అభిమానం."

నారాయణరావు కొంచెం కంగారు పడ్డాడు.

"అప్పుడప్పుడు మిమ్మల్ని గురించి చాలా గౌరవంగా ఘనంగా చెబుతూండేది. ఆమెకి మీరు మంచిమంచి నవలలు తెచ్చి యిస్తుండేవారట."

నారాయణరావు "నాకు కాలక్షేపానికి తెచ్చుకున్న పుస్తకాలు కావాలంటే యిస్తుండేవాడ్ని" అన్నాడు.

"అయిన సంబంధమే వుంది. వరసకు మేనమామ అవుతాడు. అతగానికి యిష్టంగానే ఉండేది. కాని ఈమె ససేమిరా యిష్టపడలేదు. చివరికి నాలుగురోజుల క్రితం అనుకుంటూ తానే ఒప్పుకుంది. 'అన్నయ్యా మావయ్యనే చేసుకుంటాను' అంది. ఎంత సంబరపడ్డానో. ఇంతలో ఈ పాడు జ్వరం ముంచుకొచ్చింది. పెళ్ళిచేసి ఘనంగా పంపాలని..." రాజారావు కంఠం రుద్ధమయింది. మాట పెగల్లేదు.

కొంతసేపు ఆగింతర్వాత రాజారావే మొదలు పెట్టాడు.

"మీకు పెళ్ళి నిశ్చయం అయిందటగా!"

"అవును."

"చెల్లి నాకు చెప్పింది. 'నారాయణరావుగారు చాలా అదృష్టవంతులు. పెళ్ళికూతురు చాలా అందంగా వుంటుందిట. వాళ్ళు బాగా కలవారుట కూడాను' అంటూ ఎంతో సంబరంగా చెప్పింది."

"ఆc, అందచందాలు చెప్పుకోదగినవి కావనుకోండి.

ఏదో పెద్దవాళ్ళమాట కాదనలేక..." అంటూ నసిగాడు నారాయణరావు.

"నేను మీ తరఫున వాదించాను. పెళ్ళికూతురు చాలా అదృష్టవంతురాలు. నారాయణరావుగారు తక్కువ వారేం కాదు. సంపదకి సంపదా వుంది – అందానికి అందం వుంది' అని మీ తరఫున వాదించాను. చెల్లెలు అంతా విని 'నువ్వు చెప్పిందీ నిజమే అన్నయ్యో' అని ఒప్పుకుంది" అంటూ రాజారావు నారాయణరావు వైపు ఓరగా పరిశీలనగా చూశాడు.

శ్మశానం చేరేసరికి బాగా పొద్దుపోయింది. నారాయణరావు అందరితోపాటు తనూ గుప్పెడు మట్టితీసి గోతిలో వేశాడు. ఆమె ముఖం పక్కకుతిరిగి ప్రశాంతంగా నిద్రపోతున్నట్టే వుంది.

రాజారావు రెండు చేతులా ముఖం కప్పుకుని బావురుమని ఏడ్చాడు. నారాయణరావు వారించాడు అనునయ వాక్యాలతో.

అరగంట పైగా పట్టింది ఖనన సంస్కారం పూర్తి చెయ్యటానికి. ఇద్దరు బలిష్టులయిన వ్యక్తులు మట్టి తవ్వి పోస్తున్నారు. ఇంక కొద్దిగా పూడ్చాలి.

రాజారావు చేలెత్తి నమస్కారంచేసి "ఇకపోదాం" అంటూ యివతలికి వచ్చాడు. సమాధుల మధ్యనుంచి తప్పుకుంటూ బయటపడేసరికి రాజారావుకి సొమ్మసిల్లినట్టుగా అనిపించింది కాబోలు తూలిపోబోయాడు. చప్పున పట్టుకున్నాడు నారాయణరావు.

ఇంటికి చేరేసరికి ముసలావిడ కూతురు పడుకునే మంచంవార కూర్చుని యింకా ఏడుస్తూనేవుంది. మనవలు ఆమె చుట్టూ చేరి చోద్యం చూస్తున్నారు. కోడలు పక్కనే ఉంది.

నారాయణరావు నేరుగా గదిలోకి వెళ్ళి మంచంమీద నడుం వాల్చాడు.

రాజారావు మాటలే స్ఫురణకు వస్తున్నాయి. నేనంటే ఆమెకు ఎంతో అభిమానంట!...ఎందుకో?...పుస్తకాలు యిస్తున్నందుకా?...

నారాయణరావు చటుక్కున లేచి ఆమె అయిదురోజుల క్రితం తిరిగి యిచ్చిన పుస్తకాలను పెట్టిలోంచి యివతలికి తీసి పేజీలు తిరగేశాడు. ఒక్కొక్క పేజీ మెల్లమెల్లగా తిరగేశాడు. తానూహించినట్టుగా వాటిలో ఏమీలేదు.

నారాయణరావుకి నవ్వు వచ్చింది తన ఊహాలు అంత దూరం పోయినందుకు. రాజారావు ఆ మాటలు చెప్పిన ధోరణి నారాయణరావులో యిలాంటి ఊహల్ని రేపాయి.

'అంతా తన భ్రాంతి' అనుకుని మనసు కొద్దిసేపు ఆమెగురించి యింకోలా ఆలోచించినందుకు బాధపడ్డాడు నారాయణరావు.

కిటికీలోంచి చూస్తే మామిడిచెట్టు ఇంటి గుమ్మంలో ఓ అమ్మాయి నిలబడి ఎటో చూస్తోంది.

నారాయణరావుకి చప్పున ఓ దృశ్యం జ్ఞప్తికివచ్చింది. పదిరోజుల క్రితం తను పెళ్ళి చూపులకని హడావుడిగా ఉత్సాహంగా ఇంటికి తాళంవేసి స్టేషన్లో కొచ్చేసరికి రాజారావు

చెల్లెలు గుమ్మంలో నిలబడివుంది. ఆమె తలలో ఎర్రగులాబీ తురుముకుంది. తన హడావుడిలో తాను గబగబా అడుగులు వేసుకుంటూ ముందుకుపోయాడు. సందు మొగలో తాను యథాలాపంగా వెనక్కి తిరిగేసరికి ఆమె అక్కడే నిలబడి తన వైపే చూస్తూంది.

రాజారావు మాటలు మళ్ళీ అతనిలో సంచలనాన్ని తెచ్చాయి.

ఇంకా యిలాంటివే ఆమె చేతలూ చిన్నచిన్న సంఘటనలూ గుర్తుకు వస్తున్నాయి.

“ఇన్నాళ్ళకి ఇప్పుడు— ఈ రెండు సంవత్సరాలలోనూ ఆమెను అర్థం చేసుకుంటున్నానా?” నారాయణరావు కిటికీలోంచి దూరంగా నిలబడ్డ అమ్మాయిని చూస్తూ కన్నీరు ఆపుకోలేకపోయాడు.